

ఈయన కోటు జేబులు వైశ్యశేఖరుల సంచులవలె నుండెడివి. అందులో నుండునది డబ్బుకాదు; గుప్పెళ్లకు గుప్పెళ్ల చాకొలెట్లు జేబులలో వేసికొని దారిలో కనిపించిన మిత్రులకు చేయి తెఱచి ఒక చాకొలెట్ వారి చేతిలో నుంచి గుప్పిలి గట్టిగా మూసెడివారు.

# కొన్ని స్మృతులు

## డాక్టరు వై.వి.సుబ్బారావు

శ్రీరోశయ్యగారు నాకు 1934 నుండి పరిచితులు. తెనాలి తాలూకా యందలి తురుమెళ్ళ గ్రామములోని హైస్కూలులో చదువుకొని స్కూల్ ఫైనల్ పరీక్షలో నల్గుర నాకర్షించెడి గొప్ప మార్కులతో ఉత్తీర్ణుడై కాలేజి విద్యకై గుంటూరు వచ్చినప్పుడు ఆయన వేష భాషలు అమాయికముగా నుండి అచ్చపు పల్లెటూరి వ్యక్తి యనిపించెడివాడు. అప్పటికి సముద్రము గాని కొండలు గాని చూచి యెఱుగడు కాలేజీలో చేరిన కొలది మాసములకే కొండవీటి కొండలకు పిక్నిక్ వెళ్లిన బృందములో తానుగూడపోయి ఆ కొండలు చూచి ఆశ్చర్యపడి సంతోషభరితుడై తననెంతో అభిమానించుచుండిన తన పూర్వపు హెడ్మాస్టరు, పరమ గురువు అయిన దక్షిణామూర్తి గారికి భావావేశముతో కొండల వర్ణనలతో ఉత్తరము వ్రాసెను.

S.S.L.C.లో ఈయనకు ఆశ్చర్యకరమైన మార్కులు వచ్చుటచే మేమందఱము ఆ మార్కునే ఆయనకు nick-nameగా పెట్టి పిలిచుచుండెడి వారము. ఈయన చిత్రమైన వ్యక్తి. బి.ఏ.ప్రథమ సంవత్సరము మధ్యభాగములో వావిలికొలను సుబ్బారావుగారి అభిమానిగా శిష్యుడిగా నుండెడివారు. మేము భోజనము చేయునప్పుడు పులుసు అన్నము తినుచుండగా ఎవరో

''మీ గురువుగారు కీర్తిశేషులైనా''రని చెప్పగా ఆ వార్తవిని భోజనము మధ్యనేలేచి బజారునకు వెళ్లి క్షౌర సంస్కారము చేయించుకొని తిరిగివచ్చి సచేల స్నానముచేసి కళాశాలకు వెళ్లినారు. ఇటువంటి సన్నివేశములు చాలగలవు.

అప్పటిలో హిందూమత సంబంధమైన గ్రంథములు విశేషముగా చదువుచుండెడివారు. ఆర్యులకు క్రాపు అనాచారమని చదివి పూర్ణ విశ్వాసముతో వెంటనే శిరోముండనము చేయించుకొని పిలక (శిఖ) పెట్టించుకొనెను. మిత్రులు కొందరు అపహాసము చేసెడివారు. ఇట్టివి మఱికొన్ని గలవు.

తరువాత మేము ఉన్నత విద్యలకై ఎవరి త్రోవనువారు పోయి చదువులు పూర్తిచేసికొంటిమి. నేను కొన్ని సంవత్సరముల తరువాత గుంటూరు తిరిగి వచ్చునప్పటికి ఈయన ఆంధ్రక్రైస్తవ కళాశాలలో ఇంగ్లీషు లెక్చరరుగా పనిచేయుచుండిరి. కొంతకాలము ఏ.సి.కాలేజిలో దీక్షతో పనిచేసి నలుగుర మెప్పువడసెను. భీమవరములో క్రొత్తగా స్థాపించిన కళాశాల మేనేజిమెంటువారు ఈయన దీక్ష, కృషిని పురస్కరించుకొని భీమవరము రప్పించుకొని వారి కాలేజిలో (ఇప్పటి D.N.R.College) ఆంగ్లోపన్యాసకుడుగా నియమించిరి. కొలది కాలములోనే ఈయన అక్కడ ఆంగ్లశాఖాధ్యక్షులై పలువురి మన్ననలు వడసెను.

కొన్ని సంవత్సరముల తరువాత రోశయ్యగారు తిరిగి ఏ.సి. కాలేజికే వచ్చిచేరిరి. సర్వీసులోనున్నప్పుడు సూటులోనేయుండెడివారు. ఈయన సైకిలు త్రొక్కునప్పుడు పద్మాసనము వేసినట్లుండును. ఈయన కోటు జేబులు వైశ్యశేఖరుల సంచులవలె నుండెడివి. అందులో నుండునది డబ్బుకాదు; గుప్పెళ్లకు గుప్పెళ్లు చాకొలెట్లు జేబులలో వేసికొని దారిలో కనిపించిన మిత్రులకు చేయి తెఱచి ఒక చాకొలెట్ వారి చేతిలో నుంచి గుప్పిలి గట్టిగా మూసెడివారు. ఆయన ప్రేమావేశమట్టిది.